ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

7



మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

గురువారం 16 అక్టోబరు 2025



గవర్నర్ భద్రతా ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి



రామిరెడ్డిగూడ దగ్గర పైపులకు మరమ్మతు చేస్తున్న కార్మికులు



రామన్‌పాడు ఫిల్టర్‌బెడ్

తాగునీటికి.. తండ్లాట

- రామిరెడ్డిగూడ, చౌదర్‌పల్లి గేట్ దగ్గర పగిలిన పైపులు
- 20 ఏళ్ల క్రితం కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి నగరానికి తాగునీరు సరఫరా
- ఆ పైప్‌లైన్‌కే మిషన్‌భగీరథ కనెక్షన్
- దాంతో తరచూ సమస్యలు
- జడ్చర్ల నుంచి 8-10 ఎంఎల్‌డీలు.. మన్యంకొండ నుంచి 22 ఎంఎల్‌డీల నీరు
- మరో 10 ఎంఎల్‌డీల నీరు వస్తే రోజూ అందించేందుకు అవకాశం

పాలమూరు నగరంలో 8 రోజులుగా నిలిచిన సరఫరా

మహబూబ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వేగంగా అభివృద్ధి చెందుతున్న పాలమూరు నగరాన్ని తాగునీటి ఎద్దడి వేధిస్తోంది. దశాబ్దాల కిందట వేసిన పైప్‌లైన్‌లే వాడుతుండటంతో అవి తరచూ పగిలిపోయి, సమస్య ఉత్పన్నమవుతోంది. 8 నుంచి 10 రోజులుగా నగరంలోని మూడోవంతు కాలనీలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయి జనం అల్లాడుతున్నారు. దాదాపు 3 లక్షల జనాభా ఉన్న నగరానికి రెండు సోర్సుల ద్వారా మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోంది. మన్యంకొండ నుంచి రామిరెడ్డిగూడ మీదుగా 22 ఎంఎల్‌డీల నీరు వస్తుండగా, జడ్చర్ల నుంచి 8-10 ఎంఎల్‌డీల నీరు వస్తోంది. ప్రస్తుతం మన్యంకొండ నుంచి వచ్చే తాగునీటి పైప్‌లైన్‌లు వారం రోజులుగా మరమ్మతులకు గురి కావడంతో సరఫరా నిలిచిపోయింది. చౌదర్‌పల్లి గేట్ వద్ద వారం కిందట పైప్‌లైన్ పగిలిపోవడంతో మూడు రోజుల మరమ్మతు చేసి, సరఫరా ప్రారంభించారు. తర్వాత మళ్లీ వెంటనే రామిరెడ్డిగూడ వద్ద పైప్‌లు పగిలిపోయాయి. ఒకమీటర్ డయా పైప్‌లు కావడంతో మరమ్మతులకు చాలాటైమ్ పడుతోంది. మూడోజులుగా నగర కమిషనర్‌తోపాటు యంత్రాంగం అంతా అక్కడే పనులు చేయిస్తున్నారు. ఇప్పుడు మరమ్మతులు పూర్తికాగా, మళ్లీ పైపులు ఎక్కడా పగిలిపోకుండా ఉంటే.. గురువారం నుంచి సరఫరా మొదలవుతుందని అధికారులు చెబుతున్నారు.

20 ఏళ్ల క్రితం పైపులు కావడంతో..

నగరానికి గతంలో రామన్‌పాడ్ ద్వారా తాగునీరు సరఫరా చేసేవారు. 2006-07లో నాటి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి హయాంలో కోయిల్ సాగర్ తాగునీటి పథకాన్ని చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక మిషన్ భగీరథ పథకం ద్వారా మన్యంకొండ వద్ద ట్యాంకు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి రామిరెడ్డిగూడ ద్వారా నగరానికి నీటిని అందిస్తున్నారు. మన్యంకొండ నుంచి కొత్త పైప్‌లైన్ వేసి, రామిరెడ్డిగూడ నుంచి కోయిల్‌సాగర్ నీటిని అందించే పైపులకు మిషన్‌భగీరథ పైపులతో కనెక్షన్ ఇచ్చారు. రామిరెడ్డిగూడ నుంచి నగరానికి ఉన్న పైపులు పాతవే కొనసాగిస్తున్నారు. అవి దాదాపు 20 ఏళ్లవి కావడంతో జాయింట్‌ల వద్ద పగిలిపోయి, సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నగరంలోని 30 స్టోరేజీ వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని కాలనీలకు సరఫరా చేస్తున్నారు. మన్యంకొండ నుంచి వచ్చే నీటి సరఫరాకు 22 ట్యాంకులు, జడ్చర్ల నుంచి వచ్చే నీటికి 8 ట్యాంకులను వినియోగిస్తున్నారు. జడ్చర్ల నుంచి సరఫరా అయ్యే నీరు ఏనుగొండ, శ్రీనివాస కాలనీ, పద్మావతి కాలనీ, లక్ష్మీనగర్, మెట్టుగడ్డ, మర్లు ప్రాంతాలకు సరఫరా అవుతుండగా.. మిగతా కాలనీలకు మన్యంకొండ ద్వారా వచ్చే నీరు సరఫరా అవుతోంది. 70 శాతం కాలనీలకు మన్యంకొండ ద్వారానే వస్తోంది.

సోషల్ మీడియాలో వాటర్‌వార్



నగరంలో వారం నుంచి పది రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో సామాజిక మాధ్యమాలలో వాటర్‌వార్ కొనసాగుతోంది. పాలమూరుకు మళ్లీ తాగునీటి కష్టాలు వచ్చాయని, బిందెలతో రోడ్లపైకి రావాలని, ట్యాంకర్ల వద్ద కొట్లాటలు చూడాలేమో అంటూ బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. దీనికి కాంగ్రెస్ కార్యకర్తలు మీ వల్లే సమస్యలు వస్తున్నాయని, నాసిరకం పైపుల వల్లే అంటూ కౌంటర్లు ఇస్తున్నారు. మరమ్మతులు జరుగుతున్నాయని ప్రజలు కాస్త సంయమనం పాటించాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పత్రికాప్రకటన విడుదల చేశారు. వారం రోజులుగా పైపుల మరమ్మతుల కారణంగా నీటి సరఫరా లేదని, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అన్ని వార్డులలో ప్రజలకు అందుబాటులో తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. బోర్లు రిపేర్ ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు.

పని చేయని పవర్ బోర్లు

నగరంలో దాదాపు 600 వరకు పవర్ బోర్లు ఉన్నాయి. పలుచోట్ల ఇవి పని చేయడం లేదు. అన్ని వాడుకలో ఉంటే మిషన్ భగీరథ సరఫరాలో ఇబ్బందులు వచ్చినప్పుడు పవర్ బోర్లను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. గతంలో పవర్ బోర్లను పూర్తిగా నిలిపివేయడంతో తీవ్ర విమర్శలు రాగా, మళ్లీ పునరుద్ధరించారు. ఎక్కడైనా పని చేయకుంటే మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

మరో 10 ఎంఎల్‌డీలు పెంచుకుంటే

ప్రస్తుతం నగరానికి రెండు సోర్సుల ద్వారా దాదాపు 30 ఎంఎల్‌డీల నీరు వస్తుండగా మరో 10 ఎంఎల్‌డీల నీటిని పెంచుకుంటే రోజూ అన్ని కాలనీలకు నీటిని సరఫరా చేయొచ్చు. జడ్చర్ల నుంచి 15 ఎంఎల్‌ఎల్‌డీల వరకు అనుమతులున్నా ప్రస్తుతం 8-10 ఎంఎల్‌డీలనే వినియోగించుకుంటున్నాము. దీనిపై యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నేడు పీయూలో.. స్నాతకోత్సవం

- హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ నాల్గో స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి చాన్సలర్ హోదాలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నారు. గవర్నర్‌తో పాటు ముఖ్య అతిథిగా ఎంఎస్ఎన్ గ్రూప్ కంపెనీ వ్యవస్థాపకులు, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్నె సత్యనారాయణ రెడ్డి రానున్నారు. ఈ స్నాతకోత్సవంలో పన్నెడు మందికి పీహెచ్‌డీ పట్టాలు, 71 మందికి బంగారు పతకాలు, 2,809 మందికి పీజీ, 18,666, మందికి యూజీ డిగ్రీలు అందించనున్నారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ నేతృత్వంలో యూనివర్సిటీ అధికారులు ఏడు కమిటీలుగా ఏర్పడి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

చాన్సలర్ హోదాలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వస్తుండటంతో బుధవారం వర్సిటీలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ నేతృత్వంలో పీయూ రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు, ఎస్పీ జానకి, అదనపు ఎస్పీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు డీపీఆర్‌ఓ శ్రీనివాసులు, పీయూ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ ప్రవీణ భద్రతా చర్యలు పరిశీలించారు. గవర్నర్ కాన్వాయ్ వచ్చే మార్గం, స్నాతకోత్సవ కార్యక్రమం నిర్వహించే హాల్, వేదికను అన్ని కోణాల్లో పరిశీలించారు. గవర్నర్ తిరిగి వెళ్లే వరకు తీసుకోవాల్సిన భద్రత చర్యలకు సంబంధించి వర్సిటీ అధికారులకు సూచించారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు చేపట్టనున్నారు.

గవర్నర్ పర్యటన ఇలా..

ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. 10:30 గంటలకు గవర్నర్ వర్సిటీకి చేరుకుంటారు. విద్యార్థులకు పతకాల ప్రదానం, సందేశం 12.30కి పూర్తవుతుంది. 2 గంటల వరకు యూనివర్సిటీ చాన్సలర్ రెసిడెన్సీలో బస, భోజనం ఉంటుంది. మధ్యాహ్నం 2:10 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. 2:45 గంటల వరకు అక్కడి కార్యక్రమంలో పాల్గొంటారు. 2:45కి రచయితలు కవులు కళాకారులతో ముఖాముఖిగా మాట్లాడతారు. సాయంత్రం హైదరాబాద్ బయల్దేరి వెళ్తారు.

వారికి మాత్రమే అనుమతి

స్నాతకోత్సవ కార్యక్రమం నిర్వహించే లైబ్రరీ ఆడిటోరియంలో సీటింగ్ సదుపాయం తక్కువగా ఉండటం, భద్రతా చర్యల నేపథ్యంలో ముఖ్య అతిథులు, యూనివర్సిటీ ముఖ్య అధికారులు, స్నాతకోత్సవంలో పట్టాలు పొందే విద్యార్థులను మాత్రమే అనుమతించనున్నారు. మిగతా విద్యార్థులు, తల్లిదండ్రులు వీక్షించేందుకు వర్సిటీలోని ఆయా విభాగాల వద్ద ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేశారు. యూట్యూబ్, ఫేస్‌బుక్‌లలో లైవ్ ప్రసారం చేయనున్నారు.

ప్రతిభావంతులకు పట్టాభిషేకం 8

మలుపులు తిరుగుతున్న జిల్లా క్లబ్ వ్యవహారం

- తెరపైకి బిల్డింగ్ నిర్మాణానికి అనుమతులు లేవన్న అంశం
- కలెక్టర్ ఆదేశాల మేరకు భవనాన్ని పరిశీలించిన కమిషనర్
- పర్మిషన్ లేకుంటే నోటీసులు జారీ చేస్తామని స్పష్టీకరణ

మహబూబ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా క్లబ్ ఎన్నికల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతుండగా, ఇప్పుడు బిల్డింగ్ నిర్మాణానికి అనుమతులు లేవన్న కొత్త పంచాయతీ తెరపైకి వచ్చింది. రూ.10 కోట్ల వ్యయంతో అన్ని హంగులతో నూతన భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇప్పటికే రూ.6 కోట్ల వరకు నిర్మాణానికి వెచ్చించారు. ఇదిలా ఉంటే భవన నిర్మాణానికి మునిసిపల్ అనుమతులే లేవని జరుగుతున్న ప్రచారంపై పుర అధికారులు కూడా స్పష్టత ఇవ్వడం లేదు. ఎన్నికల నేపథ్యంలో.. అనుమతులు లేకపోవడం, స్థల వివాదం కోర్టులో ఉందన్న విషయాలు వెలుగుచూడంటతో అసలు క్లబ్ అనుమతులపై విచారణ జరిపించాలని కలెక్టర్ కార్పొరేషన్ అధికారులకు సూచించారు.



అనుమతులపై ఆరా

కలెక్టర్ ఆదేశాల మేరకు కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఏసీపీ, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి బుధవారం క్లబ్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. అనుమతులపై క్లబ్ నిర్వాహకులు, పెద్దలతో చర్చించారు. అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నాగేశ్వర్‌రెడ్డిని కలిసి అనుమతి పత్రాలపై చర్చించారు. అయితే అనుమతులకోసం దరఖాస్తు చేసుకున్నామని, డీటీసీపీ వద్ద పెండింగ్ ఉన్నట్లు నిర్వాహకులు వివరించినట్లు తెలుస్తోంది. అనుమతులు రాకముందే అంతస్థాయిలో భవన నిర్మాణం చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. పలు రాజకీయ, నాటకీయ పరిణామాల మధ్య ఏకగ్రీవం అయిన నూతన అధ్యక్షుడికి ఈ వ్యవహారం తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది. అనుమతులపై పూర్తి సమాచారం సేకరించి కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని, వారి ఆదేశాల మేరకు నోటీసు జారీ చేస్తామని కమిషనర్ చెబుతున్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మధ్యాహ్న భోజనంలో కప్ప?

- సీసీకుంట మండలం లాల్‌కోట పాఠశాలలో కలకలం
- పప్పులో కనిపించిన కళేబరం
- భోజనం చేయకుండా వెళ్లి తల్లిదండ్రులకు చెప్పిన విద్యార్థులు
- ఫిర్యాదు అందిందన్న డీఈఓ.. నేడు విచారణ చేస్తామని వెల్లడి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీసీకుంట మండలం లాల్‌కోట ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో బుధవారం కప్ప కళేబరం వచ్చిందన్న విషయం కలకలం రేపింది. రోజు మాదిరిగా అక్షయపాత్ర నుంచి పాఠశాలకు మధ్యాహ్న భోజనం వచ్చింది. వడ్డించే సమయంలో పప్పులో కప్ప కనిపించిందని కొందరు విద్యార్థులు చెప్పినట్లు సమాచారం. దాంతో వారు భోజనం చేయకుండా ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు పొక్కింది. అప్పటికే కొందరు విద్యార్థులు భోజనం చేశారు. ఈ విషయం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. కప్ప విషయం బయటకు పొక్కకుండా పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు జాగ్రత్త పడ్డారని సమాచారం. డీఈవో ప్రవీణ్ కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా లాల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కప్ప వచ్చినట్లు ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమేనన్నారు. గురువారం పాఠశాలకు వెళ్లి పూర్తి విచారణ చేయనున్నట్లు తెలిపారు.

మందకొడిగా మద్యం టెండర్లు

- మహబూబ్‌నగర్ మినహా మిగతా జిల్లాల్లో అంతంతే
- మిగిలింది మూడు రోజులే
- సిండికేట్‌గా మారుతున్న వ్యాపారులు
- 227 దుకాణాలకు.. ఇప్పటి వరకు వచ్చింది 1,291 దరఖాస్తులే



మహబూబ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలకు ఆశించిన స్థాయిలో టెండర్లు రావడం లేదు. టెండర్లకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. మిగిలి ఉన్నా ఒక్కో దుకాణానికి సగటున 10 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇంకా సింగిల్ టెండర్ కూడా దాఖలు కాని దుకాణాలు ఎన్నో ఉన్నాయి. బుధవారం భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తాయని భావించగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేవలం 706 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇందులో ఒక్క మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకే 650 దరఖాస్తులు రావడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని 227 దుకాణాలకు గాను బుధవారం నాటికి 1,291 దరఖాస్తులు వచ్చాయి. మహబూబ్‌నగర్ మినహా మిగతా జిల్లాల్లో పెద్దగా స్పందన లేదని స్పష్టమవుతోంది. చివరి మూడు రోజుల్లో భారీగా దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో 131 దరఖాస్తులు రాగా, వనపర్తిలో 60, గద్వాలలో 130, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలలో 970 దరఖాస్తులు వచ్చాయి.

వ్యాపారులకు ఫోన్లు చేస్తున్న అధికారులు

ఎక్సైజ్ అధికారులు వ్యాపారులకు ఫోన్లు చేసి టెండర్లలో పాల్గొనాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. చాలామంది వ్యాపారులు చివరివరకు వేచి ఉండి తక్కువ దరఖాస్తులు వచ్చిన దుకాణాలను ఎంచుకుని టెండర్లు వేయాలని భావిస్తున్నారు. దీంతో చివరి మూడ్రోజులు వేలల్లో దరఖాస్తులు వస్తాయని భావిస్తున్నారు. 2023లోనూ చివరి మూడు రోజులు ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. అందులోనూ చివరి రోజు రాత్రి 10 గంటలకు కూడా కార్యాలయాలలో బారులు తీరారని, ఇప్పుడూ అదేవిధంగా వస్తారని ఆశిస్తున్నారు. అప్లికేషన్ ధర రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచడంతో వ్యాపారుల్లో కొంత జోష్ తగ్గిన మాట వాస్తవమే. అయినా, చాలామంది సిండికేట్‌గా మారి దరఖాస్తులు చేస్తున్నారు. ఒక్కో సిండికేట్‌లో 10-15 మంది సభ్యులుగా ఉండి 10-15-20 దుకాణాలకు టెండర్లు వేసేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు.

హెచ్‌సీఏ 2డే లీగ్‌లో మహబూబ్‌నగర్ గెలుపు

- 120 పరుగుల తేడాతో బాలాజీ క్లాట్స్‌పై విజయం
- 3 వికెట్లు తీసిన ముఖీద్, జశ్వంత్ 9

ఉపాధ్యాయురాలికి వేధింపులు

- ప్రధానోపాధ్యాయుడికి కుటుంబీకుల దేహశుద్ధి
- ఆయన్ను విధుల నుంచి తప్పిస్తాం
- కుటుంబ సభ్యులకు మండల విద్యాధికారి హామీ
- ఆలస్యంగా వెలుగులోకి.. 8

బడికి వెళ్లేందుకు 9 కిలోమీటర్ల నడక

- కర్నూల్‌లో పీఎం సభకు బస్సుల తరలింపు 8
- పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడిన విద్యార్థులు

మీరంతా ఏం చేస్తున్నారు?

- విద్యార్థులు ఆరు బయట భోజనం చేయడం ఏంటి?
- భూత్పూర్ జడ్పీ స్కూల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్
- టీచర్ల తీరుపై ఆగ్రహం



ఆరు బయట భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

భూత్పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): 'భోజనాన్ని ముందుగా ఉపాధ్యాయులు రుచి చూశాక విద్యార్థులకు వడ్డించాలి. విద్యార్థులు తినేవరకు ఉపాధ్యాయులు పర్యవేక్షించాలి. ఇక్కడ అవేవీ కనిపించడం లేదు. మీరంతా ఏం చేస్తున్నారు%'"ని ఉపాధ్యాయులను, హెచ్‌ఎంను కలెక్టర్ విజయేందిర బోయి ప్రశ్నించారు. భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో భోజనం చేయడం పట్ల కలెక్టర్ పాఠశాల ప్రాధానోపాధ్యాయురాలు ఆనందమ్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం డైనింగ్ హాల్ లోనే వడ్డించాలని, అది లేకుంటే వరండాల్లోనైనా కూర్చోబెట్టాలన్నారు. తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోమారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అంతకు ముందు కలెక్టర్ పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశీలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి

అందరి అభిప్రాయాలను తీసుకుంటాం

- ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి

కోస్గి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం మండల అధ్యక్షులు, బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అందరి నాయకులు, కార్యకర్తల సూచనలను పరిగణలోకి తీసుకుంటామని ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి చెప్పారు. బుధవారం నారాయణపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం కోస్గి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కోస్గి, గుండుమాల్, కొత్తపల్లి, మద్దూర్ మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడారు. అందరికీ అందుబాటులో ఉంటూ, పార్టీ కోసం కష్టించి పని చేసే వారినే జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్, పీసీసీ అబ్జర్వర్ మెట్టు సాయికుమార్, కోస్గి, గుండుమాల్, కొత్తపల్లి, మద్దూరు మండలాల అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నరసింహ, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమిదలు.. విభిన్న ఆకృతులు

» ఊపందుకున్న దీపావళి కొనుగోళ్లు



పేటలో ప్రమిదలు పరిశీలిస్తున్న మహిళలు

నారాయణపేట, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): వెలుగునిచ్చే దీపావళి పండుగను నారాయణపేట జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకోనేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి ప్రధాన కూడళ్లలో విభిన్న ఆకృతుల ప్రమిదలు విక్రయించేందుకు మార్కెట్‌లో అందుబాటులో ఉంచారు. దాంతో మార్కెట్‌లో లభించే విభిన్న ఆకృతుల ప్రమిదలు కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి కనబర్చుతున్నారు. ప్రమిదలు సైజును బట్టి పది రూపాయలకు రెండు నుంచి నాలుగు వరకు విక్రయిస్తున్నారు. అలంకరణల ప్రమీదలు ఆకృతులకు అనుగుణంగా ధరలు పలుకుతున్నాయి.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడిగా దార భాస్కర్



దార భాస్కర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్ ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సమక్షంలో ఉమ్మడి జిల్లా నూతన గౌరవాధ్యక్షుడిగా టీపీసీసీ కో-ఆర్డినేటర్ దార భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి (రీజినల్ సెక్రెటరీ) సబాధ్యక్షుడు దార సుందర్, గౌరవాధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు చంద్రయ్య, నర్సింహ, కృష్ణనాయక్, రామన్న, వెంకటయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బడికి వెళ్లేందుకు 9 కిలోమీటర్లు నడక..

» ఇబ్బందులు పడ్డ విద్యార్థులు

» కర్నూల్‌లో పీఎం సభకు బస్సుల తరలింపు



గ్రామం నుంచి గేటు వరకు నడిచి వెళ్లుతున్న పెద్దజట్రం విద్యార్థులు

ఊట్కూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కర్నూల్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వస్తుండటంతో ఆ సభ కోసం బుధవారం నుంచే బస్సులు బంద్ పాటించాయి. దీంతో పాటు ప్రధాన రోడ్లపై సైతం బస్సులు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బిజ్వార్, అవుసలోనిపల్లి నుంచి దాదాపు 9 కిలో మీటర్లు విద్యార్థులందరు బాగులు మోస్తూ నడుచుకుంటూ పెద్దజట్రం గేటు వరకు వెళ్లారు. అక్కడ నిలబడి బస్సుల కోసం ఎదురు చూస్తూ ఆలస్యంగా పాఠశాలకు వెళ్లారు. జక్లేర్ నుంచి పెద్దజట్రం ద్వారా నారాయణపేట బస్సుకు అనేక మంది విద్యార్థులు చదవడానికి నారాయణపేటకు వెళ్తారు. ఆర్టీసీ అధికారుల వైఖరి కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. బడానేతల కోసం ప్రజలను తరలించేందుకు బస్సులను వాడుకోవడం.. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం ఏంటని పలువురు ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు విద్యార్థులకు అంతరాయం లేకుండా బస్సులు నడపాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు మరింత తగ్గిన వరద

» కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

గద్వాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణా ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. దీంతో ప్రాజెక్టుల గేట్లు మూత పడ్డాయి మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టు మరింత వరద తగ్గి 37వేల క్యూసెక్కులు మాత్రమే వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు గేట్లను మూసివేసి విద్యుత్ ఉత్పత్తిని మాత్రమే కొనసాగిస్తున్నారు. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 62,427క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.80టీఎంసీలు కాగా ప్రస్తుతం 206.09 టీఎంసీల నిల్వ ఉంది. కాగా ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల గేట్లు కూడా మూతపడటంతో జూరాలకు 24వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు గేట్లను మూసివేసి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 23,106క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల డ్యామ్‌కు 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 2వేల క్యూసెక్కులను శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు.

ప్రియాంక మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

మహబూబ్‌నగర్ ఎస్పీ, కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే



ప్రియాంక మృతిపై వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని ప్రియాంక ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బుధవారం మహబూబ్‌నగర్ ఎస్పీ, కలెక్టర్లను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రియాంక మృతి చాలా బాధాకరమని, ఆమె మృతి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చిందన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలను తెలుసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న, నాయకులు అజయ్, వెంకటన్న ఉన్నారు.

చాలా ఆనందంగా ఉంది..



వాసవీ డిగ్రీ కాలేజీలో నేను 2020-23లో బి.బి.ఎ పూర్తి చేశాను. నాకు గోల్డ్ మెడల్ రావడం చా లా ఆనందంగా ఉంది. గవర్నర్ చేతులు మీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడం చాలా సంతోషకరమైన విషయం. నేను కష్టపడి చదివినందుకు ఫలితం దక్కింది. ముఖ్యంగా అధ్యాపకులు, నా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే నేను బీబీఏ గోల్డ్ మెడల్ సాధించాను.

- పూజా లోకతేయా, బీబీఏ, మహబూబ్‌నగర్

సంతోషంగా ఉంది..



పీయూలో నేను 2021-23 విద్యాసంవత్సరంలో ఎమ్‌కాం పూర్తిచేశాను. నాకు బంగారు పతకం రావడం చాలా సంతోషంగా ఉంది. నా జీవితంలో ఇది అతిపెద్ద విజయం. పీయూలో మా అధ్యాపకుల నుంచి చాలా నేర్చుకున్నాను. బంగారు పతకం రావడానికి అధ్యాపకులు, తల్లిదండ్రులు మద్దతుగా నిలిచారు. గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకోనుండడం సంతోషంగా ఉంది.

- దొడ్డె రమ్య, పీజీ ఎమ్‌కాం విభాగం, వెన్నచెడ్, మహబూబ్‌నగర్ జిల్లా

అధ్యాపకుల వల్లే..



ఈ క్షణం నాకు చాలా ప్రత్యేకమైన క్షణాలు. నా ప్రయాణంలో తల్లిదండ్రులు, అధ్యాపకులు నిరంతరం నాకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతగా భావిస్తున్నాను. ఈ విజయం నాకు సానుకూలతతో ముందుకు సాగడానికి, కెమిస్ట్రీ రంగంలో రాణించడానికి మరింత విశ్వాసాన్ని ఇచ్చింది. ఎంతో కష్టపడి చదివాను. నా కష్టానికి ఫలితం దక్కిందని భావిస్తున్నాను.

- అఫ్రా నజ్బీన్, పీజీ ఎంఎస్‌సీ కెమిస్ట్రీ విభాగం, మహబూబ్‌నగర్ పట్టణం

ప్రతిభావంతులకు పట్టాభిషేకం



పాలమూరు యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ విభాగం

» నేడు పీయూ నాల్గవ స్నాతకోత్సవం

» గవర్నర్ నుంచి పట్టాలు, పతకాలు అందుకోనున్న విద్యార్థులు



పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులకు పట్టాభిషేకం అందనున్నది. పాలమూరు యూనివర్సిటీ ఇందుకు వేదిక కానున్నది. గురువారం పీయూ నాల్గవ స్నాతకోత్సవంలో భాగంగా గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, డాక్టర్ ఎంఎస్ఎన్ సత్యనారాయణ రెడ్డి చేతులు మీదుగా వివిధ రంగాల్లో పరిశోధనలు చేసిన 12 మంది విద్యార్థులకు పట్టాల(డాక్టరేట్)ను అందజేస్తారు. పీజీ, యూజీ, ఫార్మసీ, ఎంబీఏ, ఎంఈడీ, బీఈడీతో పాటు పలు విభాగాలలో యూనివర్సిటీలోనే అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానం నిలిచిన 71 మంది విద్యార్థులు గోల్డ్‌మెడల్ అందుకోనున్నారు. ఇ దిలా ఉండగా, పాలమూరు యూనివర్సిటీలో 2014లో మొదటి స్నాతకోత్సవంలో 56 మంది, 2019లో రెండవ స్నాతకోత్సవం లో 115మంది, 2022లో మూడవ స్నాతకోత్సవంలో 72మంది గోల్డ్ మెడల్స్ ఆరుగురు విద్యార్థులు డాక్టరేట్‌ను అందుకోవడం గమనార్హం.

ప్రతిభ చాటిన విద్యార్థినులు...

పాలయూరు యూనివర్సిటీలో నాల్గవ స్నాతకోత్సవంలో అత్యధికంగా విద్యార్థినులదే హవా. వర్సిటీ మొత్తంలో యూజీ, పీజీ 71మందిలో కేవలం 9 మంది మాత్రమే పురుషులు ఉండగా, 63 మంది గోల్డ్ మెడల్స్ అందుకోనున్నారు. పీహెచ్‌డీ పట్టాలు అందుకునే 12మందిలో మహిళలే ఆరుగురు గవర్నర్ చేత ప్రతిభా అవార్డులు గోల్డ్ మెడల్స్, పట్టాలు అందుకోనున్నారు.

మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే నేను గోల్డ్‌మెడల్ సాధించాను. పీయూలో 2021-23 విద్యాసంవత్సరంలో ఎంఏ తెలుగు పూర్తిచేశాను. నాకు తెలుగుభాషపై మక్కువతో పట్టుదలతో చదివాను. ఆచార్యులు చాలా బాగా ప్రోత్సహించారు. నాకు బంగారు పతకం రావడం సంతోషంగా ఉంది, భవిష్యత్తులో తెలుగులోనే ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించాలని లక్ష్యం పెట్టుకున్న.

- షబానబేగం, పీజీ తెలుగు విభాగం, చెన్నారం, వనపర్తి జిల్లా

పాలమూరు పెద్దచెరువుపై పరిశోధన...

మైక్రోబయోలజీలో పీహెచ్‌డీ (పట్టా)ని గవర్నర్ చేతులమీదుగా తీసుకోనుండటం సంతోషంగా ఉంది. 'స్టడీస్ ఆన్ ఫిసికో కెమికల్ అండ్ మైక్రోబయోలజి ఎనాలిసిస్ ఆఫ్ వాటర్ రిస్టొరేషన్ పెద్ద చెరువు మహబూబ్‌నగర్' అనే అంశంపై డాక్టర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో 2018-24 సంవత్సరాల పాటు పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పూర్తి చేశాను. పర్యావరణ పరిరక్షణ కొరకు పరిశోధనలు కొనసాగిస్తున్నాను.

- విజయ్‌కుమార్, మైక్రోబయోలజీ, ఊర్కొండ, నాగర్‌కర్నూల్ జిల్లా

నా కష్టానికి ఫలితం దక్కింది



స్వామివివేకానంద (ఎస్‌వీడీసీ) డిగ్రీ కాలేజ్ మహబూబ్‌నగర్ లో 2021-24 విద్యాసంవత్సరంలో గోల్డ్ మెడల్ రావడంతో కల సాకరమైంది. నాకు డిగ్రీలో 87శాతం మార్కులు వచ్చాయి. నేను గవర్నర్‌తో గోల్డ్ మెడల్ తీసుకోనుండటం అదృష్టంగా భావిస్తున్న.

- ఫైజా తబసుమ్ బీబీఏ, బి.కె.రెడ్డి కాలనీ మహబూబ్‌నగర్

ఐటీ కంపెనీలో ఉద్యోగుల ప్రేరణ నిలుపుదలపై పరిశోధన



నేను బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో డాక్టరేట్ పొందాను. హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలో ఉద్యోగుల ప్రేరణ నిలుపుదల అనే అంశం డాక్టర్ అనురాధరెడ్డి పర్యవేక్షణలో నా పరిశోధనలు పూర్తి చేశాను. పరిశోధనలు చేసినందుకు నాకు డాక్టరేట్ దక్కింది. ఈ డాక్టరేట్ పట్టాను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా అందుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

- ఎం.సంధ్యారాణి, మాల్కాజ్‌గిరి, హైదరాబాద్

రెగ్యులర్‌గా కాలేజీ వెళ్లినందుకే...



శ్రీవాణి డిగ్రీ కాలేజీ వనపర్తిలో 2020-23 విద్యాసంవత్సరంలో బీజడ్‌సీ పూర్తి చేశాను. నేను రెగ్యలర్‌గా కళాశాలకు వెళ్లినందుకు గోల్డ్ మెడల్ సాధించగాలిగాను. అధ్యాపకులు, తల్లిదండ్రులు చాలా ప్రోత్సహించారు. గవర్నర్ చేతులమీదుగా అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉన్నది.

- షాజహన్ బేగం, బీజడ్‌సీ, వనపర్తిటౌన్

గవర్నర్ పర్యటనకు భారీ బందోబస్తు

మహబూబ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలో గురువారం జరుగనున్న స్నాతకోత్సవాలలో పాల్గొనేందుకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ గురువారం మహబూబ్‌నగర్ వస్తున్నారు. గవర్నర్ రాక సందర్భంగా జిల్లా పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. గవర్నర్ పర్యటించే యూనివర్సిటీతో పాటు కలెక్టరేట్ సమీకృత భవనంతోపాటు నగరంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఈ మేరకు బుధవారం ఎస్పీ జానకి పాలమూరు యూనివర్సిటీ చేరుకుని అక్కడి పరిసరాలను పరిశీలించారు. బందోబస్తు పరంగా తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ అధికారులకు వివరించారు. అనంతరం బందోబస్తు అధికారులతో సమావేశం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ ఎన్‌బీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, డీటీసీ డీఎస్పీ గిరిబాబు, రూరల్ సీఐ గాంధీ నాయక్, వన్‌టౌన్ సీఐ అప్పయ్య, టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్, ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

రాజ్యాధికారంతోనే బీసీలకు సమన్యాయం

» ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

పాలమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీసీలు రాజ్యాధికారం చేపట్టడంతోనే అన్ని సమస్యలు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో బీసీ జేఏసీ సామాజిక తెలంగాణ ఇంటలెక్చువల్స్ ఫోరం(ఎస్‌టీఐఎఫ్)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీతో ముఖాముఖిలో సుదీర్ఘంగా సమాధానాలిచ్చారు. మధ్యాహ్నం మూడు గంటలనుంచి రాత్రి 8గంటల వరకు అనేకమంది బీసీలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. మల్లన్న స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టీపీఆర్)లక్ష్యాలు, అధికారంలోకి వస్తే ఎలాంటి పనులు చేయగలమనే వాటిని వివరించారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాష్ట్రంలో పేరు పెరుమాల్లది(బీసీలది), ఆరగింపు అయ్యగార్లది (అగ్రవర్ణాలది)అన్నట్లు ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి ఉంటే మూడు పనులు చేయాలన్నారు. 18వ తేదీన బీసీ జేఏసీ చేపట్టనున్న బంద్‌కు మద్దతు ఇచ్చే విషయం రేపు చెబుతామన్నారు. బెక్కెం జనార్దన్, లక్ష్మణ్‌గౌడ్, ప్రభాకర్, సారంగం లక్ష్మీకాంత్,రిటైర్డ్ డీఈవో విజయకుమార్, శ్రీనివాసులు, గంగాధర్, వెంకట్రాములు, వెంకటేష్, నిర్మల తదితర ప్రముఖులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. బీసీ జేఏసీ నాయకులు సూర్యారావు, యం.శ్రీనివాస్, కోరమోని వెంకటయ్య, మధు, తీన్మార్ మల్లన్న టీం సభ్యులు అధికసంఖ్యలో బీసీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

బీసీ రిజర్వేషన్లపై 18న బంద్‌కు మద్దతు

పాలమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధనకోసం 18వ తేదీన చేపట్టిన తెలంగాణ బంద్‌కు పాలమూరు అధ్యయన వేదిక సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతదేశం,తెలంగాణ రాష్ట్రంలో ప్రతి చిన్న విషయం సాధించటానికి పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి వస్తోందన్నారు. బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌కు ఎస్సీ, ఎ స్టీ, మైనారిటీలు, ప్రజాస్వామిక వాదులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయురాలి ఇంట్లో చోరీ

గద్వాల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నల్లకుంట కాలనీలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఉన్న హైమావతి ఇంట్లో బుధ వారం చోరీ జరిగింది. పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న హైమావతి విధుల నిమిత్తం పాఠశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేలో గా ఇంట్లో ఉన్న లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం, 50 తులాల వెండి చోరీకి గురైనట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని పట్టణ ఎస్ ఐ పరిశీలించి బాధితుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనం తరం క్లూస్‌టీం వచ్చి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకుని విచార ణ చేపడుతున్నట్లు ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

వంగూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వంగూరు మండలంలోని మిట్టసదగోడులో బుధవారం విద్యుదాఘాతానికి గురై పాడి ఆవు మృతి చెందింది. పొలంలో చెట్టు వద్ద రైతు ఆవును కట్టి వేసి ఉంచాడు. తాడు పెద్దగా ఉండంతో మేత మేసుకుంటూ ఆ పక్కనే ఉన్న విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి కింద భాగంలో ఉన్న కరెంట్ తీగను తాకడంతో విద్యుత్ సరఫరా కావడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు పిట్టల శేఖర్ తెలిపాడు. రెండు రోజుల క్రితమే ఆవు ఈనిందని మృతి చెందిన ఆవు విలువ రూ, 90 వేల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు

గద్వాల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో బుధవారం ఉదయం 8గంటల ప్రాంతంలో వైన్ దూకాణం సమీపంలో మద్యం అమ్ముతున్న వెంకటేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి ఇరవై లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

» యువకుడిపై పోకో కేసు నమోదు

రాజాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన యువకుడు బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమా టలు చెప్పి మోసం చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మం డలానికి చెందిన బాలికను యువకుడు పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు.

ఆ బాలిక జరిగిన విషయాన్ని తల్లితో చెప్పడంతో ఆమె పోలీసులను ఆశ్రహించారు. బాధితురాలు తల్లి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను అప్పగించిన ఎస్ఐ

బల్మూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత నెల నుంచి ఈ నెలలో పోగొ ట్టుకున్న మూడు సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. వారి వివరాల ప్రకారం... కాట్రాజు దశరథం బాణాల గ్రామం కాగా ఎర్రమౌని కాశమ్మ, లింగోటం అచ్చంపేట మండలం గన్నేజు ప్రమిద, రామా జీపల్లి గ్రామం బుధవారం వారి సెల్‌ఫోన్లను వారికి అప్పగించాలని ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయురాలికి వేధింపులు

» ప్రధానోపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన కుటుంబ సభ్యులు

» ప్రధానోపాధ్యాయుడిని తాత్కాలికంగా ఆ పాఠశాల నుంచి తప్పిస్తాం

» కుటుంబ సభ్యులకు మండల విద్యాధికారి హామీ

» సద్దుమణిగిన వివాదం... ఆలస్యంగా వెలుగులోకి ఘటన

కొల్లాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యాబోధన చేసి వారికి జ్ఞానాన్ని అందించే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ప్రధానోపాధ్యాయుడే తోటి మహిళా ఉపాధ్యాయురాలిని సూటిపోటి మాటలతో వేధించిన ఘటన కొల్లాపూర్ మండలంలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనపై ఆ ప్రధానోపాధ్యాయుడి తీరుపై పలువురు మహిళా ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొల్లాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఇటీవలే ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టిన కొల్లాపూర్ మండల వాసి తన పాఠశాలలోనే విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయురాలిపై సూటిపోటి మాటలతో వేధిస్తున్నాడు. దీంతో ఆ ఉపాధ్యాయురాలు జరిగిన తతంగాన్ని పక్క మండలంలో నివాసముండే కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో కోపోద్రిక్తులైన కుటుంబ సభ్యులు మంగళవారం పాఠశాలకు చేరుకుని ప్రధానోపాధ్యాయుడి తీరును నిలదీసి ప్రశ్నించారు. ఇందుకు ప్రధానోపాధ్యాయుడు, కుటుంబ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు కొంతమంది అసహనానికి గురై ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఇలా ఎలా వ్యవహరిస్తారని ఆ ప్రధానోపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు.

● ఇదిలా ఉండగా సంఘటన జరుగుతున్న సమయంలోనే ఫిర్యాదు అందుకున్న మండల విద్యాధికారి ఇమ్మాన్యుయేల్ పాఠశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయురాలు కుటుంబ సభ్యులు జరిగిన తీరును ఆయనకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువురి మధ్య గొడవ సద్దుమణిగేలా పాఠశాలలో ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆ వ్యక్తిని తాత్కాలికంగా కొన్ని రోజుల పాటు వేరే పాఠశాలకు బదిలీ చేస్తామని ఉపాధ్యాయురాలి కుటుంబ సభ్యులకు మండల విద్యాధికారి హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

» 3 తులాల బంగారు గొలుసు స్వాధీనం

» దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు



దొంగను పట్టుకుని వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి

తిమ్మాజిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాజిపేట పోలీసులు దొంగతనం కేసును ఛేదించి మూడు తులాల బంగారు గొలుసు స్వాధీనం చేసుకుని దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చెందిన కందూరి విష్ణు(33) అనే యువకుడు తన స్నేహితుడు బైకు తీసుకుని ఈ నెల 13న నేరేళ్లపల్లి మీదుగా మారేపల్లికి చేరుకున్నాడు. ఒంటరిగా ఉన్న మహిళతో మాట్లాడుతూ చుట్టుపక్కల ఎవరు లేనిది గమనించి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారం పుస్తెలతాడు లాక్కొని తిమ్మాజిపేట మీదుగా పారిపోయాడు. బుధవారం మధ్యాహ్న సమయంలో జడ్చర్లలోని సిగ్నల్ గడ్డ వద్ద బైకుపై వెళ్తుండగా సీసీ కెమెరాల ఆధారంగా దొంగను పట్టుకుని పోలీసులు విచారించారు.

అప్పటికే ఓ ఫైనాన్స్‌లో బంగారు పుస్తెలతా డును తాకట్టు పెట్టి తీసుకున్న డబ్బులను తన అవసరాలకు వాడుకు న్నాడు. అట్టి పుస్తెలతాడును స్వాధీనం చేసుకుని ఎస్‌డీపీవో పర్యవేక్షణలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి సూచనల ప్రకారం నేరస్తుడ్ని రిమాండ్‌కు తరలించారు. సీఐ అశోక్‌రెడ్డిని, హరిప్రసాద్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది మదన్‌మోహన్, చైతన్య, భీముడు, రమేష్‌లను ఎస్పీ అభినందించారు.

క్రైం కార్నర్

శ్రీవారి సముద్రంలో చేపల మృత్యువాత

- చెరువు పరిసరాల్లో వెదజల్లుతున్న దుర్వాసన
- మత్స్యకారులకు రూ.లక్షల్లో నష్టం
- వైజాగ్ జాలర్ల చేతివాటమేనా?

కొల్లాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామంలో ఉన్న శ్రీవారి సముద్రంలో లక్షల రూపాయల విలువ చేసే చేపలు మృత్యువాత పడ్డాయి. మృత్యువాత పడ్డ చేపలు ఒడ్డుకు కొట్టుకురావడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతున్నది. ప్రతీ ఏడాది సబ్సిడీలో లక్షల చేప పిల్లలను ప్రజా ప్రతినిధులు, మత్స్యశాఖ అధికారులు సింగోటం శ్రీవారి సముద్రంలో వదులుతూ ఉంటారు. దీంతో స్థానిక మత్స్యకారులకు జీవనోపాధి దక్కుతుంది. విడిచే చేప పిల్లలు తీరా పెద్దయ్యాక ఒక్కొక్కటి మూడు కిలోల నాలుగు కిలోలు అయ్యాక మృత్యువాత పడి చెరువు ఒడ్డుకు కొట్టుకురావడం పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

స్థానిక మత్స్యకారులే పుట్టిలు వేసుకొని వలతో లేదా గాలం ద్వారా చేపల వేట కొనసాగించి.. జీవనోపాధి పొందాల్సి ఉంది. అయితే, కొంతమంది మత్స్యకారుల సంఘాలలో బడా వ్యక్తులుగా వ్యవహరిస్తూ వారి ప్రమేయంతో సింగోటం శ్రీవారి సముద్రంను వైజాగ్ జాలర్లకు లీజుకు ఇవ్వడంతో వారు బోట్లపై వెళ్లి నీటిలో దానవేసి చేపల వేట కొనసాగిస్తున్నారు. దీంతో బోట్ల ద్వారా వెదజల్లుతున్న డీజిల్ ఆయిల్‌తో నీరంతా కలుషితమై చేపలు మృత్యువాత పడే పరిస్థితి చోటుచేసుకున్నట్లు తెలిసింది. బుధవారం సాయంత్రం సింగోటం శ్రీవారి సముద్రం ఒడ్డుకు కొట్టుకు వచ్చిన వేల సంఖ్యలో ఉన్న లక్షల విలువ చేసే చేప పిల్లలు ఎలా మృతి చెందాయో జిల్లా మత్స్యశాఖ అధికారులు తేల్చాల్సి ఉంది. కాగా, జాలర్లు నదిలో వేసిన వలలు సకాలంలో తీయకపోవడంతో చేపలు చిక్కుకొని మృత్యువాత పడ్డాయని, తీరా వలలు తీయడంతో మృతి చెందిన చేపలు ఒడ్డుకు కొట్టుకు వచ్చాయని సముద్రం ఒడ్డున ఉన్న జాలర్లు పేర్కొనడం గమనార్హం.

బోటు షికారుకెళ్లి యువకుడి గల్లంతు

- నాగార్జునసాగర్‌లో నీట మునిగిన పృథ్వీరాజు
- ఖానాపూర్ గ్రామంలో అలుముకున్న విషాదం



అతినారపు పృథ్వీరాజు (ఫైల్)

బిజినేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి విహార యాత్రకు వెళ్లిన అతినారపు పృథ్వీరాజు(26) ప్రమాదవశాత్తు నాగార్జున సాగర్‌లో పడి మంగళవారం సాయంత్రం గల్లంతయ్యాడు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన అతినారపు పృథ్వీరాజు ఇదే గ్రామానికి చెందిన ఐదుగురు స్నేహితులతో కలిసి నల్గొండ జిల్లాలోని నేరేడుగొమ్ము, మండలంలోని వైజాగ్ కాలనీ సమీపంలో నాగార్జున సాగర్ డ్యాంలో స్నేహితులతో కలిసి బోట్ షికారుకు వెళ్లారు. ఇందులో పృథ్వీరాజు ప్రమాదవశాత్తు జారిపడి నీటిలో మునిగిపోయాడు. బోటులో ఉన్న గజ ఈతగాళ్లు నీటిలోకి దిగి వెతికినా బుధవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు. ఎన్డీఆర్ఎఫ్ దళాలు వచ్చి రాత్రి వరకు నీటిలో వెతికినా యువకుడి లభించలేదు. తల్లిదండ్రులు అతినారపు నారాయణ, పార్వతమ్మలు తమ ఒకగానొక్క కొడుకు కనపడక పోవడంతో కన్నీరు మున్నీరుగా రోదించడం అక్కడివారిని కలచివేసింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉప్పునుంతల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని దేవదారికుంటతండా సమీపంలో చోటుచేసుకొంది. ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అచ్చంపేట మండలంలోని లింగోటం గ్రామానికి చెందిన గాలిముడ్డి సురేష్ (45) మంగళవారం పని నిమిత్తం ఉప్పునుంతల మండలం దేవదారికుంటతండా గ్రామానికి వచ్చి తిరుగు ప్రయాణంలో దేవదారికుంటతండా గేట్ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో అచ్చంపేటకు తరలించి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

గద్వాల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో దౌదర్‌పల్లికి చెందిన విజయుడు గాయాల పాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు.

అక్రమంగా మొర్రం తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

కృష్ణ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా అక్రమంగా కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా శక్తి నగర్ సంబంధించిన మొర్రం టిప్పర్‌ను పట్టుకున్న సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని గుడేబల్లూరు గ్రామ శివారులోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం నుంచి అనుమతులు లేకుండా మొర్రం టిప్పర్ శక్తినగర్ వెళ్తున్న టిప్పర్ పట్టుకుని పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ నవీద్ బుధవారం తెలిపారు. అనుమతులు లేకుండా నడుపుతున్నందున ఆ టిప్పర్ డ్రైవర్ నాగరాజు, ఓనర్ హన్మగౌడపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రథమ చికిత్సా కేంద్రాలు సీజ్

గోపాల్‌పేట, అక్టోంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రాలను జిల్లా వైద్య అధికారులు సీజ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రథమ చికిత్స కేంద్రాలపై జిల్లా వైద్య అధికారులు అకస్మాత్తుగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో భాగంగా ప్రథమ చికిత్స కేంద్రాల్లో ఇంజక్షన్‌లు, గ్లూకోస్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నాలుగు ప్రథమ చికిత్స కేంద్రాలను సీజ్ చేశారు. అనంతరం అధికారులు షాపులను సీజ్ చేశారు. జిల్లా అధికారులు లక్ష్మీదేవి, యశోద, రవికుమార్, గీత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పాము కలకలం



ప్రభుత్వ పాఠశాలలోకి వచ్చిన పాము

మక్తల్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాట్రేవుపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం పాము కలకలం రేపింది. కాట్రేవ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం సమయంలో 5వ తరగతి గదిలోకి పాము రావడంతో విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలిపారు. వెంటనే ఉపాధ్యాయులు గ్రామస్థుల సహాయంతో పామును చంపి బయటకు తీసుకెళ్లారు. పాఠశాలకు సమీపంలో చెరువు ఉండడంతో పాటు కాంపౌండ్ వాల్, గేటు సరిగా లేకపోవడంతోనే పాములు క్రిమికీటకాలు వస్తుంటాయని గ్రామస్థులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

కల్వకుర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి ఒక్కరోజు జైలు శిక్ష, రూ.600ల జరిమానా న్యాయమూర్తి జే కావ్య విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. కల్వకుర్తి మండలం ముకురాల గ్రామానికి చెందిన పరుశరాములు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒక రోజు జైలు శిక్షతోపాటు రూ.600 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

గుండెను బతికిద్దాం



సీపీఆర్‌పై ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న వైద్యాధికారులు(ఫైల్)

- సీపీఆర్‌పై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన
- ఈనెల 13 నుంచి 17 వరకు కొనసాగుతున్న వారోత్సవాలు
- పాఠశాల. కళాశాల విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ
- వనపర్తి జిల్లాలోని 101 సబ్ సెంటర్ల పరిధిలో కార్యక్రమ నిర్వహణ

వనపర్తి వైద్యవిభాగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్ అంటే కార్డియోపల్మోనరీ రిససిటేషన్(హృదయశ్వాసకోస పునరుజ్జీవనం). ఇది అత్యవసరమైన పరిస్థితుల్లో ప్రాణాలకు రక్షించే పద్ధతి. ఒక వ్యక్తి గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు, శ్వాస తీసుకోవడం ఆగిపోయినప్పుడు మొదడుకు రక్త ప్రసరణ ఆగిపోతుంది. ఈ సందర్భంలో మనిషి మరణించే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. సీపీఆర్ చేయడం వల్ల తిరిగి గుండెను పని చేసే విధంగా చేయడమే కాకుండా శ్వాస తీసుకోవడం మొదలౌతుంది. ఈ ప్రక్రియనే హృదయ శ్వాసకోశ పునరుజ్జీవ చర్య అంటారు. ఛాతీ కుదింపుల వల్ల కృత్రిమ శ్వాసతో కూడిన ప్రక్రియను అనుభవం కలిగిన వైద్య నిపుణుల సమక్షంలో ప్రతీసారి చేయలేం. కాబట్టి సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీపీఆర్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతీ సంవత్సరం అక్టోబరు 13 నుంచి 17 వరకు సీపీఆర్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా సీపీఆర్‌పై ప్రత్యేక కథనం.

చేయాల్సిన పద్ధతి...

గుండె రక్తాన్ని పంపింగ్ చేయడం ఆగిపోయినప్పుడు, శరీరం గుండా ఆక్సిజన్ ప్రసరణకు నిలిచిపోయి అకస్మాత్తుగా ఊపిరితిత్తులు పనిచేయడం మానేస్తాయి. అప్పుడు మెదడుకు రక్త ప్రసరణ ఆగిపోయి నిమిషాల్లో మనిషి మరణిస్తాడు. అలాంటి సందర్భంలో నాడి, శ్వాసను గుర్తించి గుండె ఉండే ప్రదేశంలో (ఛాతీపై) నిమిషానికి 100 నుంచి 120 సార్లు గట్టిగా, వేగంగా నొక్కాలి. మధ్యలో నోటి ద్వారా కృత్రిమ శ్వాస రెండు సార్లు అందించాలి. అనంతరం మనిషిని తట్టి లేపాలి. వెంటనే 108 వాహనం ద్వారా ఏఈడీ (ఆటోమెటిక్ ఎక్స్‌ట్రనల్ డెఫిబ్రిలేటర్) వైద్యం అందించడం చేయాలి. ఈ ప్రక్రియ కోసం విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీపీఆర్ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. వారోత్సవాల సందర్భంగా సీపీఆర్‌పై శిక్షణ పొందడం కోసం, సీపీఆర్ సరిగ్గా చేయాల్సిన పద్ధతిపై నిపుణులైన వైద్యులచే అవగాహన కల్పిస్తున్నారు.

విద్యార్థులకు అవగాహన...

సీపీఆర్ అవగాహన వారోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విద్యార్థులకు హృదయ శ్వాసకోస పునరుజ్జీవ చర్యపై అవగాహన కల్పిస్తున్నారు. అందుకోసం జిల్లాలోని 58 ప్రాథమిక పాఠశాలలు, 56 కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సీపీఆర్ ఎలా చేయాలి, ఎప్పుడు చేయాలి, సీపీఆర్ చేసిన తదుపరి జాగ్రతలపై వివరిస్తున్నారు. జిల్లాలోని 101 సబ్ సెంటర్లు, 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సీపీఆర్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో 19 మంది వైద్యాధికారులు, 55 మంది ఆయూష్మాన్ ఆరోగ్య మందిర్ సభ్యులు, 165 మంది ఏఎన్ఎంలు, 548 మంది ఆశ కార్యకర్తలు పాల్గొని విద్యార్థులకు సీపీఆర్‌పై వివరించనున్నారు.

నిమిషాల్లో ప్రాణాలు కాపాడే పద్ధతే సీపీఆర్



సీపీఆర్ చేయడం అంటేనే నిమిషాల్లో ప్రాణాలు కాపాడే పద్ధతి. గుండెపోటు వచ్చిన వ్యక్తిని సకాలంలో గుర్తించి సీపీఆర్ చేస్తే 5 నుంచి 10 నిమిషాల్లో తిరిగి గుండె పంక్షన్ మొదలై బ్రెయిన్ డెడ్ కాకుండా జీవం పోయడం జరుగుతుంది. అత్యంత కీలకమైన ఈ ప్రక్రియను ఇప్పటికే జిల్లాలో అన్ని శాఖల అధికారులు, సాధారణ ప్రజలకు గతంలో వివరించడం జరిగింది. తాజాగా సీపీఆర్ వారోత్సవాల సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ విద్యార్థులకు, వారితో పాటు ఆర్టీసీ సిబ్బందికి కూడా సీపీఆర్‌పై అవగాహన కల్పించి, శిక్షణ ఇస్తున్నాం. ఈ పద్ధతిని ప్రతీ ఒక్కరు తెలుసుకొని, నేర్చుకోవడం ఎంతో ముఖ్యం.

- డాక్టర్ అల్లే శ్రీనివాసులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, వనపర్తి

హెచ్‌సీఏ 2డే లీగ్‌లో మహబూబ్‌నగర్ గెలుపు

- 120 పరుగుల తేడాతో బాలాజీ క్లాట్స్‌పై విజయం
- 3 వికెట్లు తీసిన ముఖీద్, జశ్వంత్



గెలిచిన మహబూబ్‌నగర్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) 2డే లీగ్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 120 పరుగుల తేడా గెలిచించి. మొదటి రోజు బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 76.5 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బుధవారం హైదరాబాద్ మొయినాబాద్‌లోని ఎస్ఆర్-1 క్రికెట్ మైదానంలో బ్యాటింగ్‌కు దిగిన బాలాజీ క్లాట్స్ జట్టు 39.3 ఓవర్లలో 118 పరుగులకు కుప్పకూలింది. జట్టులో కార్తీకేయ 30 పరుగులు చేశాడు. జిల్లా బౌలర్లలో ముఖీద్ 3, జశ్వంత్ 3, మనోజ్ 2, కే శ్రీకాంత్, షాదాబ్‌అహ్మద్ ఒక్కో వికెట్ తీసి జట్టు విజయానికి కృషి చేశారు. 2డే లీగ్‌లో విజయం సాధించడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ ఎం.రాజశేఖర్ జిల్లా జట్టు క్రీడాకారులు, కోచ్ అబ్దుల్లాను అభినందించారు.

పాఠశాల స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటాలి

- ఉత్సాహంగా అండర్-17 కబడ్డీ జట్ల ఎంపికలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో లక్ష్మణ్‌సింగ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి క్రికెట్ టోర్నీలో ప్రతిభ చాటాలని అర్బన్ మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్‌సింగ్ అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడ రేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక స్టేడియం మైదానంలో మహబూబ్‌నగర్ జిల్లా అండర్-17 బాల, బాలికల కబడ్డీ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ నిర్వహించారు. ఎంపికలను ఎంఈవో లక్ష్మణ్ సింగ్ హాజరై ప్రారంభించారు. కబడ్డీ బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ అర్బన్ ప్రథమ, నవాబ్‌పేట ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ రూరల్ ప్రథమ, కోయిలకొండ ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి, టీజీపీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, పేటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, రాంచందర్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు చందన ఎంపిక

మహమ్మదాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16 నుంచి 18 వరకు పటాన్‌చెర్వులో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలకు మహమ్మదాబాద్ మండలం నంచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చందన ఎంపికయ్యారు.

ఈమె 69 ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరులో నిర్వహించిన పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు కెప్టెన్‌గా ఆడి ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతిని సాధించింది. రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు జిల్లా జట్టుకు ఎంపికైనందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి, పీడీ, ఉపాధ్యాయుడు ఆనందం వ్యక్తం చేశారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- డీవైఎస్‌వో కృష్ణయ్య
- ముగిసిన 69వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు



గద్వాల జిల్లా జట్టుకు ప్రథమ బహుమతిని అందజేస్తున్న డీవైఎస్‌వో, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, హెచ్‌ఎం

ధరూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపు ఓటములు సమానమని, వాటిని క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని జోగుళాంబ గద్వాల జిల్లా డీవైఎస్‌వో కృష్ణయ్య అన్నారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి చక్కటి ప్రతిభ కనబరిచిన ఉమ్మడి జిల్లా జట్లను అభినందించారు. ధరూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) జోనల్ లెవెల్ అండర్-14 బాలబాలికల కబడ్డీ పోటీలు దిగ్విజయంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ తోట శ్రీనివాసులు మాట్లాడుతూ ఉమ్మడి ఐదు జిల్లాలు గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట నుంచి కబడ్డీ పోటీలకు బాల బాలికల టీంలు హాజరయ్యాయన్నారు.. హోరాహోరీగా జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో గద్వాల జిల్లా ప్రథమ స్థానం, వనపర్తి జిల్లా ద్వితీయ స్థానం దక్కించుకున్నాయని తెలిపారు.

అదేవిధంగా బాలికల విభాగంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు ప్రథమ, మహబూబ్‌నగర్ జిల్లాకు ద్వితీయ స్థానాల్లో నిలిచాయన్నారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి, ఈ నెల 16న సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో జరిగే 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

అనంతరం విజేతల జట్లకు డీవైఎస్‌వో కృష్ణయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి ట్రోఫీ, మెడల్స్‌ను అందజేశారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



దీపికను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, షూటింగ్‌బాల్ రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం

మక్తల్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 22 నుంచి 24 వరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగిన 44వ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో నారాయణపేట జిల్లా ఊట్కూర్ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ఇంటర్ విద్యార్థిని దీపిక జిల్లా తరపున ఆడి నాల్గవ స్థానం పొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మంజుల, షూటింగ్‌బాల్ రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం తెలిపారు.

బుధవారం గురుకుల పాఠశాలలో సన్మానించి మాట్లాడారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన దీపిక నవంబరు 5 నుంచి 10వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ గజియాబాద్‌లో జరుగు జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు తరపున పాల్గొంటుందన్నారు. అలాగే షూటింగ్‌బాల్ క్రీడల్లో పాల్గొన్న కళ్యాణి, దీపిక, హేమలత, రాజి, నవనీత, లక్ష్మీ, మిరాజ్‌లకు సర్టిఫికెట్లు అందించారు. అలాగే రాష్ట్ర టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొన్న తేజస్వినీ, జస్విలను సన్మానించి సర్టిఫికెట్లు అందించారు. పీఈటీ లావణ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎంఈవో, ఉపాధ్యాయుల సస్పెన్షన్

కొత్తకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో ఎంఈవో, ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ బుధవారం జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6వ తేదీన నాటవెల్లి ప్రాథమిక పాఠశాలను ఆర్‌జేడీ విజయలక్ష్మి సందర్శించారు. ఈ సమయంలో విధుల పట్ల ఇద్దరు ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉన్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ ఇద్దరు ఉపాధ్యాయులు బాలచెన్నయ్య, శ్రీధర్‌గౌడ్‌తో పాటు కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో కృష్ణయ్యను సస్పెండ్ చేశారు.

8 యూనిట్లకే పరిమితమైన విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వరద తగ్గిపోవడంతో ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 8 యూనిట్లను మాత్రమే ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎగువ దిగువ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా 4,004 మిలియన్ యూనిట్లను చేపట్టగా ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు 426.797 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో 4 యూనిట్లను ప్రారంభించి 4.290 యూనిట్లను చేపట్టగా ఇప్పటివరకు 412.284 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి టోర్నీలో ప్రతిభ చాటాలి

- డీవైఎస్‌వో శ్రీనివాస్
- ఉమ్మడి జిల్లా జట్టుకు వాలీబాల్ అకాడమీ విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీకి ఎంపికైన అకాడమీ క్రీడాకారులతో డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీలో ప్రతిభ చాటాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. నేటి నుంచి 18వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు వాలీబాల్ అకాడమీ క్రీడాకారులు చందు, ప్రశాంత్ ఎంపికయ్యారు. బుధవారం జిల్లా క్రీడాశాఖ కార్యాలయంలో డీవైఎస్‌వో శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలీబాల్ అకాడమీలో శిక్షణ తీసుకోవడం వల్లే వాలీబాల్ ఎంపికల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం లభించిందని అన్నారు. టోర్నీలో ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేయాలని, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో కోచ్ పర్వేజ్‌పాష పాల్గొన్నారు.

జాజాపూర్‌లో ప్రపంచ విద్యార్థుల దినోత్సవం

- అబ్బుర పరిచిన 'కలాం.. సలాం' ఆకృతి



కలాం.. సలాం అక్షరాకృతిలో విద్యార్థులు

నారాయణపేటరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత క్షిపణి పితామహుడు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి ప్రపంచ విద్యార్థుల దినోత్సవాన్ని మండలంలోని జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. కలాం జీవిత చరిత్రను విద్యార్థులకు డిజిటల్ టీవీలలో చూపించి విద్యార్థుల లక్షణాలను కలాం జీవితం నుంచి స్వీకరించాల్సిన అద్భుతమైన గుణాలను వివరించి విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. విద్యార్థులు కలాం.. సలాం ఆకృతిలో కూర్చుని అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ, మధుసూదన్, లక్ష్మణ్, నర్సింహ, నిర్మల, శిరీషలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్..

ఈకేవైసీ తప్పనిసరి

నవాబ్‌పేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీలో పనిచేసే కూలీలు ప్రతీ ఒక్కరు తమ కార్డులను ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో జయరాములు అన్నారు. బుధవారం మండలంలోని కాకర్లపాడ్‌లో కూలీలతో మాట్లాడారు. అంతకుముందు నర్సరీని పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

ఒక్క మొక్క వంద ప్రాణాలకు ఊపిరి



ఔషధ మొక్క నాటుతున్న ఫారెస్ట్ రీజినల్ డైరెక్టర్ రఫియోదీన్

మిడ్జిల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, ఒక మొక్క వంద ప్రాణాలకు ఊపిరినిస్తుందని ఫారెస్ట్ రీజినల్ డైరెక్టర్ రఫియోదీన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కృష్ణకుమార్‌తో కలిసి 20 రకాలకు చెందిన 80 ఔషధ మొక్కలను పాఠశాల ఆవరణలో నాటారు. ఫారెస్ట్ ఫీల్డ్ అధికారి నాగేష్, ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, సువర్ణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

జడ్చర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరం కార్యక్రమంలో భాగంగా మండలం గంగాపురం గ్రామంలో సైబర్ నేరాలపై బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు అవగాహన కల్పించారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 4 విద్యార్థులు బృందాలుగా ఏర్పడి గ్రామస్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రోగ్రాం అధికారులు శ్రీనివాసులు, వేణు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మిడ్జిల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలుగొమ్ముల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి సోదరుడు రాంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. అదే విధంగా మున్ననూర్ బీఆర్ఎస్ నాయకుడు యాదయ్య తల్లి చిట్టెమ్మ మృతి చెందగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వేముల గ్రామానికి చెందిన శాంతయ్య మనుమరాలు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండు, మాజీ ఎంపీపీ సుదర్శన్, నాయకులు లక్ష్మారెడ్డి, రాములు, కృష్ణయ్య, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా వెంకటేశ్

జడ్చర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా జడ్చర్ల మునిసిపల్ కార్మిక నాయకుడు ఆకుల వెంకటేశ్ ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజిల్‌లో నిర్వహించిన రాష్ట్ర మహా సభలలో బుధవారం రాష్ట్ర కమిటీలో ముగ్గురికి అవకాశం దక్కింది. రాష్ట్ర కార్యదర్శిగా వెంకటేశ్, కమిటీ సభ్యులుగా ఇందిరమ్మ, కృష్ణకు అవకాశం కల్పించారు.

చికెన్ వ్యర్థాలను అడ్డుకున్న మునిసిపల్ అధికారి

జడ్చర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా చికెన్ వ్యర్థాలను తీసుకెళ్తున్న వాహనాన్ని బుధవారం మునిసిపల్ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేశ్ అడ్డుకున్నారు. పట్టణంలోని పలు చికెన్ సెంటర్లలో వ్యర్థాలను వాహనంలో తీసుకెళ్తుండగా ఇందిరానగర్ కాలనీ సమీపంలో అడ్డుకున్నారు. చికెన్ వ్యర్థాలను తీసుకెళ్లేందుకు అనుమతులు ఇవ్వలేదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దంటూ హెచ్చరించారు. మునిసిపల్ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేశ్‌తో చికెన్ వ్యర్థాలను తీసుకెళ్తున్న వ్యాపారి, అతని అనుచరులు వాగ్వివాదానికి దిగారు. ఇదే క్రమంలో వ్యర్థాలను తీసుకెళ్తున్న వాహనాన్ని అక్కడి నుంచి వ్యాపారి తప్పించాడు.

శేరిపల్లిని సందర్శించిన వనపర్తి రైతులు

భూత్పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌డీసీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైతుల పంటలను పరిశీలించడానికి బుధవారం వనపర్తి జిల్లా నుంచి రైతులు, సంస్థ డైరెక్టర్లు, వనపర్తి జిల్లా కో-ఆపరేటివ్ అధికారి పరిమళాదేవి ఆధ్వర్యంలో మండలంలోని శేరిపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్ రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వ్యవసాయ సాగు ఉత్పత్తులు, పంటలను పరిశీలించారు. ఎలా పండిస్తున్నారు.? ఎంత మోతాదుల్లో ఎరువులు వాడుతున్నారు? అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఫ్రెండ్ రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు వీరస్వామి, రైతులు మల్లేష్, వెంకటయ్య, రామకృష్ణ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు, గోవర్ధన్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఏఎంవో శ్రీనివాసులు, సీఎంవో సుధాకర్‌రెడ్డి



అమిస్తాపూర్‌లో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

దేశాభివృద్ధిలో కలాం కృషి ఎనలేనిది

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధిలో అబ్దుల్ కలాం కృషి ఎనలేనిదని ముందుకు సాగాలని ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, సీఎంవో సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలాం ల్యాబ్‌లో కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్ డ్రీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామన్‌గౌడ్, టీఎన్ శ్రీధర్, టీఎన్ వెంకటేశ్వర్లు, శ్రీధర్ సురేఖ, కమిటీ అధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శోభ, అనురాధ, నర్సప్ప, రవీందర్ పాల్గొన్నారు.

వాగ్దేవి కళాశాలలో..

జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. న్యూటౌన్‌లోగల కలాం విగ్రహానికి కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ గీతాదేవి, ఐఐటీ నీట్ ఇన్‌చార్జి పావని, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతినందన్‌రెడ్డి, డైరెక్టర్ కోట్ల శివకుమార్, నాగేందర్, రాఘవేంద్రరావు, ఎఫ్‌సెట్ ఇన్‌చార్జి షాకీర్ హుస్సేన్, చెన్నయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు.

● భూత్పూర్ : మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో అబ్దుల్ కలాం చిత్ర పటానికి యువకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.పారుక్, షాకీర్‌పాషా, రియాజ్, తిరుపతయ్య, భాస్కర్, ఫజల్, ఉస్మాన్, ఇంతియాజ్, ఫెరోజ్, ఖాసీం, సద్దాం పాల్గొన్నారు.

● దేవరకద్ర : కౌకుంట్ల మండల కేంద్రంలో బుధవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా బస్టాండ్ దగ్గర ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

● గండీడ్ : భారతదేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన క్షిపణి పితామహుడు భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అని మాజీ ఎంపీపీ శాతిరంగ్యా అన్నారు. బుధవారం కలాం జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ సర్పంచులు రాంలాల్, రాజేశ్వర్, నాయకులు అనంతయ్య గుప్త, వేణుగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెన్నయ్య, మాజీ కోఆప్షన్ మెంబర్ రహీం, విష్ణువర్ధన్‌రెడ్డి, పత్తి గోపాల్ పాల్గొన్నారు.

● మూసాపేట : ఏపీజే అబ్దుల్ కలాం ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు పాటు పడాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు భీమన్నయాదవ్ పేర్కొన్నారు. అడ్డాకుల మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ఆవరణలో కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండలంలోని తిమ్మాయిపల్లితండా యూపీఎస్ పాఠశాలలో కలాం చిత్రపటానికి నివాళి అర్పించారు. హెచ్ఎం బాలరాజు, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ ఉన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించాలి



ధాన్యం, పత్తి కొనుగోళ్ల పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్ గురించి రైతులకు అవగాహన కల్పించాలని విజయేందిర బోయి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మద్దతు ధరలను తెలిపే పోస్టర్లను విడుదల చేసి, మాట్లాడారు. పత్తి కొనుగోళ్లలో కొత్త యాప్ విధానాన్ని అమలు చేయడం ద్వారా మిల్లుల వద్ద పత్తి రైతులు నిరీక్షించే పరిస్థితి ఉండదని తెలిపారు. కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్న రైతులు వారం రోజుల్లోపు ఎప్పుడైనా పత్తిని మిల్లులకు తీసుకెళ్లి విక్రయించుకోవచ్చని తెలిపారు. జిల్లాలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం, పత్తి కొనుగోళ్లు చేపట్టాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మధుసూదన్‌నాయక్, జిల్లా మార్కెటింగ్ అధికారిణి బాలమణి, సివిల్ సప్లై డీఎం రవినాయక్, డీఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు. అంతకుముందు గురుకులాలు, వసతి గృహాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయండి

ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. వీసీ అనంతరం అధికారులతో మాట్లాడుతూ అప్రమత్తంగా ఉండి, ధాన్యం కొనుగోళ్లను నిర్వహించాలన్నారు. డీఆర్డీవో నర్సింహులు, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్, జిల్లా సహకార అధికారి శంకరచారి, తూనికలు కొలతల శాఖ అధికారి రవీందర్ పాల్గొన్నారు.

బహుజన రాజ్యం కోసం ఏకం కావాలి

» రౌండ్ టేబుల్ సమావేశంలో ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ అధ్యక్షుడు బెక్కం జనార్దన్



సంఘీభావం తెలుపుతున్న బీసీ నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బహుజన రాజ్యం కోసం బీసీలు ఏకం కావాలని ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ అధ్యక్షుడు బెక్కం జనార్దన్ అన్నారు. బుధవారం పీయూలోని పీజీ సెంటర్ హాల్ నిర్వహించిన బీసీ రిజర్వేషన్లపై రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు చట్ట సభలో బిల్లు చేయడం , ఆ బిల్లు గవర్నర్ దగ్గర ఆగిపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 9 విడుదల చేసింది. దీనిపై రెడ్డి సంఘం కోర్టుకు వెళ్లడం హైకోర్టు స్టే విధించడం అంశాలపై మేధావులు, అధ్యాపకులు, విద్యార్థి సంఘల నాయకులతో చర్చించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్విపాత్ర అభినయ నాటకాలు ఆపాలన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు బీసీలంతా ఏక తాటిపైకి రావాలన్నారు. బీసీ మేధావులు, లక్ష్మణ్, రమేష్, ప్రభాకర్, పీయూ అధ్యాపకులు డాక్టర్ భూమయ్య, గాలెన్న, రామ్మోహన్, పాల్గొన్నారు.

మాజీ పీపీ పుట్టపాగ రఘుపతికి డాక్టరేట్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని పేదప్రజలకు సేవలను గుర్తించి మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పుట్టపాగ రఘుపతికి ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ ఇండియా వేదికలో వెల్ ఎడ్యుకేషన్ వీస్ కౌన్సిల్ ఆఫ్ న్యూఢిల్లీ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేశారు. న్యాయవాది పుట్టపాగ రఘుపతి పేద ప్రజలకు, రైల్వే స్టేషన్లలో, బస్టాండ్లలో భిక్షాటన చేసే వారికి అన్నదానంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో ఆయనకు డాక్టరేట్ అందజేసినట్లు తెలిపారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

» వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శశిభూషన్, డాక్టర్ అర్చన, కళ్యాణి



సేంద్రియ వ్యవసాయంపై ప్రదర్శనను తిలకిస్తున్న రైతులు

మహబూబ్‌నగర్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రసాయన ఎరువులతో భూములు సారం కోల్పోతాయని, సేంద్రియ ఎరువులు వాడి నాణ్యమైన పంటతో పాటు భూసారం పెంచాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శశిభూషన్, సమన్వయకర్త డాక్టర్ అర్చన, శాస్త్రవేత్త కళ్యాణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాచన్‌పల్లిలో జిల్లా రైతు విజ్ఞాన కేంద్రం, వనపర్తి మహాత్మజ్యోతిరావు పూలే మహిళ వ్యవసాయ కళాశాల విద్యార్థుల సంయుక్తంగా మహబూబ్‌నగర్ రూరల్ మండలం మాచన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు సమీకృత వ్యవసాయ పద్ధతులు, స్మార్ట్ ఫార్మింగ్ మల్చింగ్, సమీకృత కీటక నియంత్రణ, ఫేర మూన్ ట్రాప్స్, నానో యూరియా, బయోగ్యాస్ జీరో ఎనర్జీ కూల్ చాంబర్ ఓప్స్ కాటన్, గ్రీన్ హౌస్, సేంద్రియ, ఆధునిక ఆధునిక వ్యవసాయం, సోలార్ ఇరిగేషన్, పుట్టగొడుల పెంపకం, సోలార్ ఫెన్సింగ్, ఫాంపాండ్ తదితర అంశాలపై అవగాహన సదస్సు కల్పించారు. అనంతరం రైతులతో కలిసి వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ మేడ విరుపు కుళ్ళ, కాండం తొలుచు పురుగు, కంకినల్లి, అగ్గి తెగులు, సుడిదోమను నివారించే విధంగా రైతులకు అవగాహన కలిపిస్తే మంచి దిగుబడి పొందుతారన్నారు. కార్యక్రమంలో ఏవో శృతి, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, ఏఈవో ఆసీఫ్, గ్రామ కార్యదర్శి లక్ష్మీకాంత్, మాజీ సర్పంచులు వెంకటేశ్వర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలపై అరాచకాలు అరికట్టాలి

గండీడ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఉమ్మడి గండీడ్ మండల కోఆర్డినేటర్లు స్వాతి, జ్యోతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంచన్‌పల్లిలో గ్రామీణ మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీలు, మహిళల హక్కులు వారిపై జరుగుతున్న అరాచకాలు, సమాన వేతనంపై అవగాహన కల్పించారు.

ఖర్గేను పరామర్శించిన ఎమ్మెల్యే



ఖర్గేను పరామర్శిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పరామర్శించారు. ఢిల్లీలోని ఖర్గే నివాసంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డితో కలిసి బుధవారం పరామర్శించారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం

జడ్చర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడ్గల్ గ్రామంలో రూ.24 లక్షల ముడా నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు బుధవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, నాయకులు సాయిరెడ్డి రఘుమారెడ్డి, లక్ష్మారెడ్డి, రామస్వామిగౌడ్, నర్సింహులు, బాలరాజ్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, బండ కృష్ణయ్య, రాంజీ నాయక్, వీరస్వామి పాల్గొన్నారు.

అక్షరాస్యతను పెంపొందించడమే లక్ష్యం



అక్షరాభ్యాసం చేయిస్తున్న వెంకటేశ్వరమ్మ

కోయిలకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల్లో అక్షరాస్యత పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, మాట్లాడారు. అంగన్‌వాడీల్లో చిన్నారుల విద్య కోసం ప్రత్యేక వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సత్యమ్మ, హెల్త్‌వర్కర్ నాగమణి పాల్గొన్నారు.

'వినాయకనగర్ సమస్యలు పట్టవా'

పాలమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హౌసింగ్‌బోర్డు, వినాయకనగర్, బైపాస్ రోడ్డులోని పలు సమస్యలపై మునిసిపల్ అధికారులు పట్టించుకోవటం లేదని కాలనీ కమిటీ ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపల్ ఏఈలు, సూపర్ వైజర్‌కు విన్నవించినా పట్టించుకోవటం లేదన్నారు.

కొనసాగిన ధాన్యం విక్రయాలు

దేవరకద్ర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్రకు మార్కెట్ యార్డులో బుధవారం ధాన్యం విక్రయాలు కొనసాగాయి. పెద్ద హంస 72 క్వింటాళ్ల విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.1,899, కనిష్ఠంగా రూ.1,898 పలికినట్లు అధికారి జయశ్రీ తెలిపారు.

పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా పేదరిక నిర్మూలన పథకాల అమలు, 2015 బాలల చట్టపరమైన హక్కులు, విద్యాహక్కు చట్టం, బాల కార్మికులు, అక్రమ రవాణాపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిర పేర్కొన్నారు. స్థానిక తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ఉమెన్స్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రశేఖర్, ఎన్జీవో పారా లీగల్ వలంటీర్ శివన్న, సీపీఆర్ మాస్టర్ ట్రైనర్ బాబుల్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం నాగభూషణం వివిధ హక్కుల గురించి వివరించారు.

రేపు కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

జడ్చర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అభ్యర్థి ఎంపికపై శుక్రవారం జడ్చర్ల నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలను రెండు బ్లాక్‌గా విభజించినట్లు తెలిపారు. బ్లాక్ ఏలో జడ్చర్ల, మిడ్జిల్, ఊర్కొండ మండలాలు, బ్లాక్ బీలో నవాబ్‌పేట, రాజాపూర్, బాలానగర్ మండలాలున్నాయని తెలిపారు. ఉదయం 10 నుంచి 2 గంటల వరకు బ్లాక్ ఏ, మధ్యాహ్నం 3 గంటలకు బ్లాక్ బీలోని మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి, మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు అభ్యర్థి ఎంపికపై అధిష్ఠానం అభిప్రాయ సేకరిస్తున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని, వారిని తీసుకువచ్చే బాధ్యతను ఆయా మండల అధ్యక్షులకు అప్పగించినట్లు వివరించారు.

అధిక ధరలకు మద్యం విక్రయాలపై రిలే దీక్ష



రిలే నిరాహర దీక్ష చేపట్టిన తెలంగాణ రైతు సంఘం నాయకులు

జడ్చర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వైన్స్ దుకాణదారులు, బెల్ట్‌షాపుల నిర్వాహకులు అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆల్వాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలిశాయని, మద్యం బాటిల్స్‌పై కనీసంగా రూ.20 నుంచి అత్యధికంగా రూ.150 వరకు పెంచి విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాల్సి ఉండగా అందుకు భిన్నంగా అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ధరలకు విక్రయిస్తున్న వైన్స్ దుకాణదారులపై, బెల్ట్‌షాపుల నిర్వాహకులపై ఎక్సైజ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిలే నిరాహార దీక్షలో నాయకులు భీమయ్య, మున్నయ్య, చిన్న, వెంకటయ్య పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వకుంటే నిరవధిక సమ్మె

జడ్చర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ వేతనాలు ఇవ్వకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ పేర్కొన్నారు. జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను ఐదు రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చిన శ్రీశాంతి ఏజెన్సీ కాంట్రాక్టర్ నేటికీ చెల్లించలేదని, అందుకే ఆందోళనకు దిగామన్నారు. జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం పెండింగ్ వేతనాల కోసం ఆందోళన చేపట్టి, మాట్లాడారు. వేతనాలు చెల్లించాలంటూ ఆందోళన చేపట్టిన క్రమంలో ఏజెన్సీ నిర్వాహకులతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకళ సమక్షంలో చర్చలు జరిపారని, ఐదు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని ఏజెన్సీ నిర్వాహకులు నేటికీ చెల్లించలేదన్నారు. ఆసుపత్రి కార్మికులు నరసింహ, నవీన్, శేఖర్, రవీందర్, రామకృష్ణ, విజయలక్ష్మీ, మణెమ్మ, శివలీల, పద్మ, సుకృమ్మ, అలివేలు, భార్గవి, నీరజ పాల్గొన్నారు.

స్పందించిన ప్రభుత్వం

» విశ్రాంత ఉపాధ్యాయుడికి అందిన బెనిఫిట్స్



బాధితుడు కొండయ్యతో మాట్లాడుతున్న డీఈవో

గండీడ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించడానికి డబ్బులు లేక ఇంట్లోనే ఆక్సిజన్ సహాయంతో ఉన్న విశ్రాంత ఉపాధ్యాయుడు కుడుముల కొండయ్య పరిస్థితిని కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్యమంత్రి దృష్టికి బుధవారం తీసుకెళ్లింది. స్పందించిన ముఖ్యమంత్రి అన్ని రకాల బెనిఫిట్లను విడుదల చేయాలని అధికారులను ఆదేశించాడు. రాత్రికిరాత్రే బాధితుడి ఖాతాలో రూ.9 లక్షలు జమయ్యాయి. మిగితావి కూడా ప్రాసెస్‌లో ఉన్నాయని, అవి కూడా త్వరలో జమ అవుతాయని అధికారులు తెలిపారు. అంతకుముందు కలెక్టర్ చొరవతో డీఈవో ప్రవీణ్‌కుమార్, ఆర్డీవో నవీన్, వైద్యాధికారిని పద్మజ గ్రామానికి చేరుకొని మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఎంఈవో జనార్దన్, మండల వైద్యాధికారి చంద్రశేఖర్, తహసీల్దార్ మల్లికార్జునరావు ఉన్నారు. అదే విధంగా విశ్రాంత ఉపాధ్యాయుడికి ప్రభుత్వం బెనిఫిట్స్ అందజేయాలని కోరుతూ ఉమ్మడి గండీడ్, మహమ్మదాబాద్ మండల ఉపాధ్యాయులు ఎంఈవో జనార్దన్, ఎంపీడీవో హరిచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు

మూసాపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సమయంలో స్పృహ కోల్పోయి పడిపోతే వెంటనే స్పందించి సీపీఆర్ చేయడంతో ప్రాణాలు కాపాడొచ్చు అని సీపీఆర్ మాస్టర్ ట్రైనర్ డాక్టర్ షబానాబేగం పేర్కొన్నారు. అడ్డాకుల మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సీపీఆర్‌పై ఆమె అవగాహన కల్పించారు. ఏదైన ప్రమాదం జరిగిన, గుండెపోటు వచ్చి కిందపడిపోయిన వ్యక్తికి శ్వాస వచ్చేదాక ఛాతీ భాగంగా గట్టిగా నొక్కి నిమిషానికి 120 సార్లు సీపీఆర్ చేయాలని, ఒకవేళ కదలికలు వచ్చి శ్వాస వస్తే వదిలిపెట్టాలని, ఆపై ప్రాక్టీకల్‌గా చేసి చూపించి అవగాహన కల్పించారు. తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో సద్గుణ, నయాబ్ తహసీల్దార్ ఖాలీద్ బీన్ ఏక్బాల్, వైద్యాధికారి ఎం.హుస్సేన్, సీహెచ్‌వో షబ్బీర్ హుస్సేన్, డాక్టర్ వీరస్వామి, డాక్టర్ అయేషా, డాక్టర్ ప్రవళిక, ఉన్నారు.

రెండు రోజుల్లో పనులు ప్రారంభం



పనుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

భూత్పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భూత్పూర్ నుంచి కర్వెనకు వెళ్లే బీటీ రోడ్డుకు ప్రభుత్వం రూ.4.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. బుధవారం పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ విజయ్‌కుమార్, దేవరకద్ర డివిజనల్ ఇంజనీరు అధికారి లక్ష్మణ్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రోడ్డును పరిశీలించారు. రెండు మూడు రోజుల్లో బీటీరోడ్డు పనులు ప్రారంభించాలని గుత్తేదారుకు అధికారులు సూచించారు. చాలా కాలంగా కర్వెన గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారి వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు భూపతిరెడ్డి పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి



గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

భూత్పూర్/మహబూబ్‌నగర్ రూరల్/దేవరకద్ర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పశువుల పెంపకదారులు, రైతులు పశువులు, గేదెలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న గాలికుంటు నివారణ టీకాలు తప్పని సరిగా వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో గాలికుంటు నివారణ టీకాల మందులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 277 పాడి పశువులకు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం అప్పాయిపల్లి, మనికొండ, గాజులపేట గ్రామాల్లో 242 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి జీషాన్ అలీ తెలిపారు. దేవరకద్ర మండలం బస్వాయపల్లి గ్రామంలో పశువులు, ఆవులకు, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు జిల్లా పశువైద్యాధికారి మధుసూదన్ గౌడ్ తెలిపారు.